క్లుప్తంగా

కార్మికులకు అండగా పోరాటం

సింథియా: కార్మికులకు అండగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ నాయకులు తీర్మానించారు. శనివారం సంస్థ ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. యూనియన్ సభ్యులు పార్టీ సభ్యత్వం తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ మురళి, యూనియన్ గౌరవాధ్యక్షుడు రమణ, సెక్రటరీ రాము, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కర్రి ఆదిబాబు, ట్రెజరర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ చైతన్య

విశాఖవిద్య: బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ బెహరా చైతన్య మాట్లాడుతూ విద్యార్థులే కళాశాలకు పట్టుకొమ్మలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్,సుకన్య, అనిల్, డాక్టర్ హిందుమతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మృతదేహం రాజమండ్రి తరలింపు

సీతమ్మధార: నగరంలోని బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో ఆత్మహత్య చేసుకున్న యువతి సత్యప్రియ (31) మృతదేహానికి కేజీహెచ్‌లో శనివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని అంబులెన్సులో తల్లి శ్రీ వెంకటరమణి, ఇతర బంధువులు రాజమండ్రి తరలించారు. భర్త, అత్తింటివారి వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. భర్త కార్తికేయ, మామ సూర్యచంద్రరావు, అత్త శైలజను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. మృతురాలి తల్లి శ్రీవెంకటరమణి, ఇతర బంధువులు మృతదేహం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తెని అత్తింటి వారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి ఆరోపిస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కోట్ల రూపాయల కట్నం ఇచ్చినా తన కుమార్తెని ఇలా చూడాల్సి వస్తుందనుకోలేదని విలపించారు. మార్చురీ వద్ద ద్వారకా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కేసుని ఏసీపీ రాంబాబు పర్యవేక్షణలో ద్వారకా స్టేషన్ సీఐ బీవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభయకు న్యాయం చేయాలని ధర్నా


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కంచరపాలెం: కోల్‌కతా ఆర్‌జీకార్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్యకు గురైన వైద్యురాలు అభయకు న్యాయం చేయాలని, సీబీఐ విచారణను సత్వరమే పూర్తి చేయాలని జ్ఞానాపురం పాత లారీ యార్డ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవోడబ్ల్యూ - ఐఎఫ్‌టీయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై.కొండయ్య ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల వైఖరిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ ఉపాధ్యక్షురాలు కె.బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, కమిటీ సభ్యులు లక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉల్లి..లొల్లి!


నాసిరకం ఉల్లిపాయలు

- రైతుబజార్లలో నాసిరకం **ఉల్లిపాయలు**
- బయట మార్కెట్‌లో **కిలో రూ.70**
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న **వ్యాపారులు**
- ఉల్లిపాయల కోసం వినియోగదారుల **అవస్థలు**


ఉల్లిపాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

విశాఖ విద్య: నిత్యావసర సరకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో సామాన్య ప్రజానీకం ఏమీ కొనుక్కొని తినలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉల్లిపాయలు, టమాటా వంటి రోజువారీ అవసరాలకు వినియోగించే సరకులు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉండడం లేదు. రైతు బజార్లకు నాసిరకం ఉల్లిపాయలు, టమాటా వస్తుండడంతో వీటిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి కనబరచడం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ బయట మార్కెట్‌లో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

రైతు బజార్లలో నాసిరకం ఉల్లిపాయలే గతి

పశ్చిమ నియోజకవర్గంలో గోపాలపట్నం, మర్రిపాలెం, కంచరపాలెం, ములగాడ రైతు బజార్లు నిర్వహిస్తున్నారు. వీటిలో గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలో దుకాణాలకు మంచి గిరాకీ ఉంటుంది.కంచరపాలెం రైతు బజార్‌లో శనివారం 3,200 మంది వినియోగదారులు సరుకుల కొనుగోలు చేశారు. జిల్లాలో సీతమ్మధార, ఎంవీపీ రైతుబజార్ల తర్వాత ఆ స్థాయిలో రోజువారీ లావాదేవీలు జరిగేది ఇక్కడే. అదే విధంగా గోపాలపట్నం రైతుబజారుకు 2,800 మంది, మర్రిపాలెంలో 2,200 మంది, ములగాడలో 700 మంది వినియోగదారులు కొనుగోళ్ల కోసం వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు లెక్క తేల్చారు. ప్రతీ రోజూ ఇదే స్థాయిలో వినియోగదారుల నుంచి రైతు బజార్లకు డిమాండ్ ఉన్నప్పటికీ అవసరాల మేరకు ఇక్కడ నిత్యావసర సరకులు అందుబాటులో ఉండటం లేదని వినియోగదారులు అంటున్నారు.

భారమైనా బయటే కొనుగోలు

మార్కెట్‌లో ఉల్లిపాయల ధరలు రోజుకో రీతిన విక్రయిస్తున్నారు. శనివారం బయట మార్కెట్‌లో ఉల్లిపాయలు కేజీ రూ.70 నుంచి 80 వరకు విక్రయించారు. రైతుబజార్లలో సోలాపూర్ రకం రూ.54లు, కర్నూలు రకం రూ.38ల చొప్పున విక్రయించారు. అయితే రైతు బజార్లలో విక్రయించే ఉల్లిపాయలు నాసిరకంగా ఉంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. సోలాపూర్ రకం ఉల్లిపాయలు పెద్దగా ఉన్నా, పచ్చిగా ఉంటూ రెండు మూడు రోజులకే పాడైపోతున్నాయని చెబుతున్నారు. కర్నూలు ఉల్లిపాయలు సైజు బాగా చిన్నగా ఉండడంతో పాటు కుళ్లిన వాసన వస్తున్నవే రైతు బజార్లలో విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కూరల్లోకి ఉల్లిపాయలు తప్పనిసరి కావడంతో బయట మార్కెట్లో వ్యాపారులు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తుందని వినియోగదారులు చెబుతున్నారు.

కృత్రిమ కొరతతో అధిక ధరలు

రైతు బజార్లకు ఉల్లిపాయలు గతంలో మహారాష్ట్ర నుంచి దిగుమతి ఉండేది. ప్రస్తుతం మహారాష్ట్ర ఉల్లిపాయలు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కర్నూలు రకం ఉల్లిపాయలు పూర్తిగా పాడైపోయినవే వస్తున్నాయి. మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిక కొరత సృష్టిస్తుండడంతోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని దకాణదారులు అంటున్నారు. ఉల్లిపాయలు, టమాటా వంటి సరకులు సవ్యంగా సరఫరా కావడం లేదని, దీని వల్ల తమ వ్యాపారాలు సైతం అంతంతమాత్రంగానే సాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా సింహాచలం స్టేషన్ ఆధునికీకరణ పనులు

ఫుట్‌వే బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న వెతలు


నిర్మాణంలో ఉన్న ఫుట్ వే బ్రిడ్జి


చురుగ్గా సాగుతున్న పనులు

విశాఖ విద్య: సింహాచలం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా చంద్రానగర్ గ్రామస్తుల సౌకర్యార్థం చేపట్టిన ఫుట్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.ప్రస్తుతం ఉన్న 1.8 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కొత్తగా 3 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఏడు ట్రాక్‌లపై విస్తరిస్తూ 107మీటర్ల పొడవు గల ఫుట్‌వే బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దీని వల్ల సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చే చంద్రానగర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల నివాసితులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సింహాచలం స్టేషన్‌ను అమృత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నారు. స్టేషన్ భవనం నుంచి ప్రయాణికులను నేరుగా ప్లాట్‌ఫారాలకు తీసుకెళ్లడానికి ఎయిర్-కాన్కోర్సు నిర్మించారు. ఇది 12మీటర్ల వెడల్పుతో నిర్మించామని.. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. సింహాచలం వద్ద ఫుట్‌వే బ్రిడ్జి నిర్మాణం వేగంగా జరుగుతోందని స్థానిక ప్రజల అవసరాల మేరకు ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది అమృత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సిరులతల్లికి సహస్ర తులసీ దళార్చన


తులసీ దళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీ దళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి



ఉక్కునగరం కూడలి వద్ద సేవ్ వైజాగ్ స్టీల్ పోస్టర్ ప్రదర్శిస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చి తమ కుటుంబాలు కాపాడాలని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కుటుంబీకులు (భార్య, పిల్లలు) యాజమాన్యాన్ని కోరారు. శనివారం సాయంత్రం ఉద్యోగుల కుటుంబీలు ఉక్కునగరం కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు వెంటనే జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. మహిళలు మాట్లాడుతూ ఉద్యోగులకు గత నెలలో సగం జీతం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. ఈ నెల కూడా ఇంత వరకు జీతం విషయం తేల్చలేదన్నారు. జీతాలు చెల్లించకపోవడం వల్ల తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పిల్లల చదువు, కుటుంబ నిర్వహణ భార మవుతుందని వాపోయారు. దీనికి తోడు రుణాలకు డిఫాల్టర్లుగా మారుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. యాజమాన్యం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కునగరంలో కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూచిపూడిలో ఇంద్రాణి ప్రతిభ


కూచిపూడి ప్రదర్శన ఇస్తున్న ఇంద్రాణి నరేంద్ర


లండన్‌లో ఇండియన్ హై కమిషన్ మన్ననలు పొందిన ఇంద్రాణి నరేంద్ర

డాబాగార్డెన్స్: నాట్యదీపిక అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర లండన్‌లో ప్రతిభ చూపారు. కూచిపూడిలో డబుల్ డిప్లొమా చేసేందుకు లండన్ వెళ్లిన ఇంద్రాణి నరేంద్ర అక్కడి తెలుగు వారికి, ఆ దేశస్థులకు కూచిపూడిలో శిక్షణ అందిస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తరఫున కూచిపూడి ప్రదర్శన ఇచ్చి లండన్‌లో ఇండియన్ హై కమిషన్ (ఇండియన్ ఎంబసీ) మన్ననలు పొంది విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

వసతిగృహానికి పలువురి తరలింపు

సీతమ్మధార: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సమక్షంలో ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఒడిశాకి చెందిన మాలతి (21), పంజాబ్‌కి చెందిన దీప (50), సోని (50), శ్రీకాకుళానికి చెందిన రాజేశ్వరి (50), విశాఖకు చెందిన శారద (26)ని టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ-ఏయూటీడీ మహిళల నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. అలాగే, బొబ్బిలికి చెందిన భాస్కర్ (30), శ్రీకాకుళానికి చెందిన చంద్రమణి (58), రామస్వామి (65) విజయనగరానికి చెందిన గౌరినాయుడు (37), విశాఖకు చెందిన జగదీష్ (28), మొహీద్ (32), ఒడిశాకి చెందిన గురునాథ్ సుధాకర్ (49), రామభోయ్ (40), కటక్‌కి చెందిన అజయ్ (64) తదితరులను పురుషుల వసతిగృహానికి తరలించారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ఆందోళన



మల్కాపురం నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో పాటు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఐ మల్కాపురం జోన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మల్కాపురం వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ,గుడాల బాబూరావు మాట్లాడుతూ కూటమి పాలనలో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారం చేపట్టిన నాలుగు నెలలకే నిత్యావసర సరకుల ధరలు,విద్యుత్ చార్జీలు భారీగా పెంచారంటే వీరికి ప్రజలపై ఎంత ప్రేమ ఉందో స్పష్టత వచ్చిందన్నారు.ఎన్నికల ముందు ఒక మాట,గెలిచిన తర్వాత మరో మాట కూటమి నైజం అన్నారు.పెరిగిన ధరలను తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం


ప్రకాష్‌నగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది


కాలువలను దగ్గరుండి శుభ్రం చేయిస్తున్న జీవీఎంసీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సింథియా: జీవీఎంసీ 62వ వార్డులో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్లితే జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లేది. దీంతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'అపారిశుద్ధ్యం-దోమలకు ఆవాసం' అనే కథనం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు శనివారం ఉదయం వార్డు పరిధిలోని మురుగుకాలువల్లో వ్యర్థాలను తొలగించి, డంపింగ్ యార్డ్‌కు తరలించారు. రోడ్లపై చెత్తాచెదారం తొలగించి దోమలు రాకుండా మందులను స్ప్రేయింగ్ చేశారు. ఇకపై మురుగు కాలువలను నిరంతరం శుభ్రం చేయించి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించే ఏర్పాట్లు చేస్తామని అధికారులు వివరించారు.

మారుతీ సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్


మారుతీ సర్కిల్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

మల్కాపురం: డాక్‌యార్డ్ వీడీఆర్ గొడౌన్స్ నుంచి మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో శనివారం సాయంత్రం భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆ సమయంలో శ్రావణి షిప్పింగ్‌కు సంబంధించిన కంటైనర్లు రాకపోకలు సాగించడమే సమస్యకు ప్రధాన కారణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు.ఈ సమస్య నాలుగు రోజుల నుంచి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

వీడీఆర్ గొడౌన్స్ మీదుగా మారుతీ సర్కిల్ యామలుపు నుంచి చాలా మంది వాహనదారలు నగరానికి చేరుకుంటారు. డాక్‌యార్డ్ వద్ద వంతెన మార్గం మూసి వేయడంతో పారిశ్రామిక వాసులతో పాటు వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు ఈ మార్గం ద్వారానే నగరానికి చేరుకుంటున్నారు. అయితే మారుతీ సర్కిల్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం ఉంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో కంటైనర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ సమయంలో ఇతర వాహనాలు వెళ్లే దారి ఉండడం లేదు. దీంతో తరచూ ఇరువైపుల గంటల తరబడి వివిధ వాహనాలు నిలిచిపోతున్నాయి. సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటక ధామం

● సాగర దుర్గమ్మ ఆలయం


మెట్ల మార్గం వద్ద కనిపించే నౌకల కదలికలు


సాగరదుర్గ ఆలయానికి చేరుకునే మెట్ల మార్గం


సాగరదుర్గ ఆలయం నుంచి కనిపించే తీరం, జెట్టీ

షిప్‌యార్డ్‌కు అతి సమీపాన సాగరదుర్గ ఆలయం పర్యాటక ధామంగా వెలుగొందుతోంది. ఎత్తైన కొండపై పచ్చటి చెట్ల మధ్య **దుర్గమ్మ కొలువై ఉంది. ఎంతో చరిత గల ఈ** ఆలయానికి ప్రతి శుక్రవారం, దసరా ఉత్సవాల సమయంలో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కార్తీక మాసం కావడంతో పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.

ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. తీరం వద్ద ఇసుక తీస్తున్న సమయంలో దుర్గమ్మ రూపం దొరికిందని ఆ రూపాన్ని ఇక్కడ కొండపై ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. కొండపై నుంచి చూస్తే సాగరతీరం అందాలు ఎంతో సుందరంగా కనిపిస్తుంటాయి. పోర్టుకు వచ్చే నౌకలు ఇక్కడ తీరం వద్ద మనకు నిత్యం కనిపిస్తుంటాయి. ఈ ఆలయానికి ప్రస్తుతం ఆర్టీసీ సర్వీస్ లేకున్నా ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రోడ్డు మార్గంలో ఆలయానికి చేరుకునే మార్గం ప్రత్యేక అనుభూతి మిగులుస్తుంది.

మల్కాపురం

ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగండి

● హార్బర్ ఏసీపీ కాళిదాసు


సీఐకు సూచనలిస్తున్న హార్బర్ ఏసీపీ కాళిదాసు

పెదగంట్యాడ: స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని హార్బర్ ఏసీపీ కాళిదాసు సూచించారు. ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం సాయంత్రం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మెలగాలని, వారికి సత్వర న్యాయం అందేలా చూడాలని సీఐకు సూచించారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చర్యలు తీసుకోవాలన్నారు.